


పార్వతి తన జీవితం ఇలా అవుతుందని ఎప్పుడూ ఊహించలేదు. అగ్నిసాక్షిగా పెళ్లాడిన భర్త ఇంత దగాకోరుగా మారతాడని కలలో కూడా అనుకోలేదు. ఛీ...ఛీ...! ఈ మొగుడితో కాపురం చేయడం కంటే హుస్సేన్‌సాగర్‌లో దూకడం మేలు.

కానీ ముక్కుపచ్చలారని పసికందు స్వప్న? స్వప్న జీవితం కూడా కలగా, కన్నీటి జలగా మిగిలిపోతే తానా ఊహనే భరించలేకపోతోంది.

మరి, ఎన్నాళ్లిలా?

కన్నవాళ్లు పెళ్లిచేసి తమ బాధ్యత తీరిపోయిందని చేతులు కడుక్కున్నారు. భర్తను వదిలేసి, బిడ్డతో పుట్టిల్లు చేరితే అదనపు భారంగా ఉండడం తప్ప బావుకునేదేమీ ఉండదు. భర్తతో తెగతెంపులు చేసుకుని వెళ్లిపోతే? స్వప్ననెలా బతికించుకోవాలి? తానెలా బ్రతకాలి?

పార్వతి గుండెనీ, కండరాల్నీ నరనరాల్నీ అనుక్షణం కాలుస్తున్న సమస్యలివి. భవిష్యత్తును తలచుకుని ఆమె పడే వేదన వర్ణనాతీతం. ఆరేళ్లు కూడా నిండని స్వప్నను కారలించుకుని రోజుకు రెండు మూడుసార్లయినా ఏడుస్తుంది. తల్లి ఎందుకు ఏడుస్తుందో అర్థంగాక స్వప్న కూడా శ్రుతి కలుపుతుంది. కానీ సమస్యకు పరిష్కారం?

* * *

"రాజీ? నా పరిస్థితి విన్నావుగా, చిన్ననాటి స్నేహితురాలివి. అందులోనూ పేరున్న లాయరువి. ఈ దుస్థితిలో నువ్వేదైనా మంచి సలహా ఇచ్చి నా పాపనూ, నన్నూ కడతేర్చవూ"

వెక్కిళ్లు పెడుతూ పసిపాపలా రోదిస్తున్న పార్వతిని అక్కున చేర్చుకుని ఓదార్చింది రాజీ.

రాజీకి ఇంకా వివాహం కాలేదు. తను ప్రేమించిన ఒక్కగానొక్క పురుషపుంగవుడు చివరి నిముషంలో 'కట్నం' కోసం ఆశపడడంతో తానీ జన్మకు పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకుంది. ముప్పయ్ అయిదేళ్లు దాటుతున్నా తన నిర్ణయాన్ని అణుమాత్రంగా కూడా మార్చుకోని ధృఢచిత్తం గల యువతి రాజీ.

"చూడు పార్వతీ? వైవాహిక బంధం చాలా పవిత్రమయింది. సంసారమన్నాక ఎన్నో కష్టనష్టాలుంటాయి. ఆడది సహనానికి ప్రతీక. సుఖదుఃఖాలకి అతీతంగా స్త్రీ తన జీవితాన్ని తీర్చిదిద్దుకోగలగాలి. మనదేశంలో ఎంతోమంది అతివలు వ్యభిచారుల్తో కాపురం చేస్తున్నారు. హంతకుల్తో, దొంగల్తో, తాగుబోతుల్తో జీవితలను పంచుకుంటున్నారు. కన్నీళ్లతో కాపురాల్ని సాగిస్తున్నారు. భర్తే దైవంగా భావించి వాళ్ల కాళ్లకింద బానిసల్లా పడి ఉంటున్నారు. అంతేగానీ, విడాకుల కోసం అందరూ పరుగెత్తుకు రావడం లేదు.

"ప్రతి ఇల్లాలికీ ఎన్నో సమస్యలుంటాయి. తప్పదు. భరించాలి. మొగుణ్ణొదిలేసిన భార్యను పురుగులా చూస్తూ చీదరించుకుంటుంది సమాజం. ఆ అనుభవం నీకెదురైతే... ఆ మొగుడే మేలని అనుకోవాల్సిన పరిస్థితి వస్తుంది కాబట్టి, కష్టమో, నష్టమో నీ భర్తను బాగుచేసుకో, ఆ బాధ్యత నీదే"- నెమ్మదిగానే అయినా సీరియస్‌గానే చెప్పింది రాజీ?

"ప్లీజ్ రాజీ? ఆ ఒక్క సలహా తప్ప నువ్వే సలహా ఇచ్చినా పాటిస్తాను. విషం తాగి చావమన్నా చస్తానుకానీ ప్రతి నిముషం అనుమానాల్తో అవమానిస్తూ భార్యను అత్యంతహీనంగా చూసే ఆ కసాయిమొగుడు నా కక్కరలేదు" పార్వతి కంఠం ఈసారి తీక్షణంగా పలికింది. ఆమె ఆవేశాన్నీ ఆ ఆవేశం వెనుక దాగిన బాధనీ రాజీ అర్థం చేసుకుంది.

కొన్ని క్షణాల ఆలోచనల తర్వాత

"ఓ.కె. నీకు విడాకులు వచ్చేలా చూస్తాను, తర్వాత భవిష్యత్తు?" రాజీ అడిగింది.

"ముందీ అగ్నిగుండంలోంచి బయటపడితే చాలు రాజీ. భవిష్యత్తు సంగతి తర్వాత చూసుకోవచ్చు. నీలాంటి వారింట్లో పాచిపని చేసైనా నేను నా బిడ్డను పోషించుకోగలను".

పార్వతి ఆత్మవిశ్వాసానికి మనసులోనే జోహార్లర్పించింది రాజీ?

ఆ తర్వాత పార్వతి కోరుకున్నట్లే పార్వతికీ, పార్వతి 'భర్త' ముకుందానికీ కోర్టు ద్వారా విడాకులు ఇప్పించింది రాజీ?

* * *

— మునిరత్నం రెడ్డి

పార్వతి జీవితం స్థిరపడేంత వరకూ తనింట్లోనే ఉండమని బలవంతం చేసింది రాజీ. ఇలాంటి పరిస్థితుల్లో మరెక్కడికి వెళ్లినా, ఈ దిక్కుమాలిన సమాజంలో రక్షణ ఉండదనే విషయం పార్వతికీ తెలుసు కనుక గత్యంతరం లేక రాజీ ఇంట్లోనే ఉండిపోయారు తల్లీ బిడ్డలిద్దరూ.

రోజులు నిస్సహాయంగా దొర్లిపోతున్నాయి. భర్త జ్ఞాపకాలు ఇంకా పార్వతి మనసును అంటిఉన్నా అసహ్యంతో వాటిని దూరం చేయాలని చూస్తోంది పార్వతి.

"అమ్మా? డాడీ, ఏడీ?" అని స్వప్న అడిగినప్పుడు మాత్రం పార్వతి కళ్లలో నీళ్లు సుళ్లు తిరగడం రాజీ గమనించకపోలేదు. అయితే, రాజీ కూడా ముప్పయ్ ఏళ్లయినా నిండని పార్వతి జీవితం మోడువారి పోవడాన్ని చూస్తూ ఊరుకోక, తన ప్రయత్నం తాను చేస్తోంది.

కానీ? బిడ్డతల్లిని భార్యగా స్వీకరించే నాథుడు ఈ సమాజంలో దొరకద్దూ? ఒకవేళ ఎవరైనా ముందొకొచ్చినా, ఆ కాపురం కలతలు లేకుండా నడుస్తుందా?

రాజీ ఆలోచిస్తుంది. అసలు, మళ్లీ పెళ్లికి పార్వతి ఒప్పుకుంటుందనే నమ్మకం లేకపోయినా, అందుకు తగినవాడు దొరికితే ఆతర్వాత పార్వతిని ఒప్పించాలి అనుకుంది రాజీ.

రాజీ ఆలోచనల్లో సుధీర్ మెదిలాడు. పాపం-పెళ్లయిన అయిదేళ్లకే భార్య చనిపోయి విరక్తితో జీవితం గడుపుతూ, కోర్టులో ఎల్డీసీగా ఉన్నాడు. తాను కనిపించినప్పుడు మాత్రం ఎంతో ఉల్లాసంగా మాట్లాడే సుధీర్‌ను కదలించి చూస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనల్తో రాజీ కుదుట పడింది.

ఓ శుభ ముహూర్తాన సుధీర్‌ను తన ఇంటికి ఆహ్వానించింది రాజీ. అనుకున్న సమయానికి సుధీర్ వచ్చాడు.

"సుధీర్ గారూ? మీతో పర్సనల్‌గా మాట్లాడదామని ఇంటికి రమ్మని పిలిచి మీకు ఇబ్బంది కలిగించాను" అంటూ నవ్వుతూ సాదరంగా లోనికి ఆహ్వానించింది రాజీ.

"ఫర్వాలేదు. మీరు రమ్మంటే ఎక్కడికైనా నేను రావడానికి సిద్ధమే" నవ్వుతూ కూర్చున్నాడు సుధీర్. కాఫీలు తాగాక మెల్లగా అసలు విషయంలోకి వచ్చింది రాజీ.

"మీరు పెళ్లెందుకు చేసుకోకూడదూ?" అని రాజీ పెళ్లి విషయం ప్రస్తావించేసరికి సుధీర్

ఆశ్చర్యపోయాడు.

"నేనూ చేసుకోవాలనే, కానీ అయిదేళ్లు కాపురం చేసిన వాడిని నన్నెవరు చేసుకుంటారండీ" అన్నాడు సుధీర్ నవ్వుతూ.

"మీకు చేసుకునే ఉద్దేశ్యం ఉంటే నేనో సంబంధం చెప్తానండీ" రాజీ.

"చెప్పండి" సుధీర్.

"ఆవిడకు ముప్పయ్ ఏళ్లుంటాయి. ఓ చిన్నపాప కూడా ఉంది. భర్తతో విడాకులు తీసుకుని ఏడాది దాటింది. ఆవిడ అందంగానే ఉంటుంది. మీరు సరేనంటే ఆమె జీవితం బాగుపడుతుంది. మీకూ ఓ తోడు దొరికినట్లవుతుంది" అంది రాజీ.

కొద్ది నిముషాలు ఆలోచనల్లో పడ్డాడు సుధీర్.

సుధీర్ ముఖ కవళికలను చూసి సంతృప్తి చెందిన రాజీ ఎందుకైనా మంచిదని తన గదిలో ఉన్న పార్వతిని పిలిచింది. పాపతో పాటు పార్వతి వచ్చింది. "ఈయన నా స్నేహితులు సుధీర్" అని పార్వతికి పరిచయం చేసింది.

"నమస్కారమండీ"- పార్వతి వినయంగ చేతులు జోడించింది.

"నమస్తే" అంది స్వప్న ముద్దుగా

"వెరీగుడ్! నమస్తే" అని పాప బుగ్గను చిదిమాడు సుధీర్. ఆ తర్వాత పార్వతి టీ తీసుకొస్తానని లోపలికి వెళ్లింది.

"పార్వతి అందంగానే ఉంది. పాప ఇంకా ముద్దుగా ఉంది" అనుకున్నాడు సుధీర్ మనసులో తనకు పిల్లలు పుట్టే యోగ్యత లేదని డాక్టరు చెప్పడం వల్లనేకదా, తన భార్య గొడ్రాలుగా బతకడం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకుంది. ఇప్పుడు ఏకంగా తల్లీ బిడ్డా ఇద్దరూ తనకు దక్కడం, ఈ ఒంటరితనంలో ఎంత అదృష్టం"- తన అదృష్టానికి తనే మురిసిపోయాడు సుధీర్.


"ఈవిడ మీ బంధువా?" అడిగాడు సుధీర్ రాజీని.

"నా తోబుట్టువులాంటిది. చిన్నప్పట్నుంచీ మేమిద్దరం కలసి చదువుకున్నాం. డిగ్రీ పూర్తికాకముందే వాళ్ల తల్లిదండ్రులు ఓ వ్యసనపరుడికిచ్చి దీనిగొంతు కోశారు" ఆవేదనగా చెప్పింది రాజీ.

సుధీర్ ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాడు.

"రాజీగారూ? ఈ సంబంధం బాగానే ఉంది. తల్లీబిడ్డను నా భార్యా బిడ్డలుగా స్వీకరించడానికి నాకేమీ అభ్యంతరం లేదు. అయితే, అందుకు మీరెంత కట్నంగా, అంటే వాళ్లను జీవితాంతం బతికించాలి కదా? అందుకు ఎంతిస్తారో చెబితే... పెళ్లి సెటిల్ చేసుకుందాం" అన్నాడు సుధీర్ అతి మామూలు ధోరణిలో. కట్నం అనేమాట వినేసరికి రాజీ పక్కలో బాంబు పడ్డట్టయింది.

"షటప్"- గట్టిగా అరిచింది రాజీ. "దయచేసి మీరు వెళ్లిపోండి. జీవితం చివరిదశ కొచ్చారు కదా? ఏదో తోడు చూపిద్దామని నేను ప్రయత్నిస్తే కట్నం అడుగుతారా? మీకు సిగ్గనిపించడం లేదూ? చచ్చేప్పుడు తగలేసుకుపోతామా డబ్బునీ?" ఆవేశంతో నిప్పులు కక్కుతూ ఇక మాట్లాడలేకపోయింది రాజీ.



ఉన్నట్టుండి రాజి ఏరుచుకుపడేసరికి కొద్ది క్షణాలు నిరుత్తరుడైపోయాడు సుధీర్.

"ఈ ఉపన్యాసాలు కూడు పెట్టవు. మొగుడూ ముద్దులూ లేకుండా ఇంత సంపాదిస్తున్నారు మీరు రేపు తగలేసుకుంటారా?" తేరుకున్నాక రోషంగా అడిగాడు సుధీర్.

"ఓ.కే... నా డబ్బంతా... నా కాస్తంతా కట్నంగా ఇచ్చి పార్వతికి పెళ్లి చేస్తాను". అదే ఆవేశంతో అరిచింది రాజీ.

"దెన్, ఓ.కే? నేనీ పెళ్లికి సిద్ధమే"- నవ్వులు చిందిస్తూ అన్నాడు సుధీర్.

* * *

అంతవరకూ వీరి సంభాషణను అవతలి గదిలోంచి వింటున్న పార్వతి "ప్లీజ్, ఆగండి" అంటూ లోపలికి వచ్చింది.

పార్వతి ముఖం చూసి తీవ్ర భావోందళనకు గురైనట్లు రాజీ ఆగ్రహించింది.

"నేనీ పెళ్లి చేసుకోను" నిర్మొహమాటంగా చెప్పింది పార్వతి.

"పార్వతీ, ఆవేశపడకు నే చెప్పేది విను" లాలనగా అంది రాజీ.

"నేనంత విన్నాను రాజీ. నువ్వు నాకెంత ఉపకారం చేశావో ఇంకా ఎంత చేయబోతున్నావో అంతా విన్నాను. బట్ నేనీపెళ్లి చేసుకోను. చూడండి సుధీర్‌గారూ? నా పూర్వపు భర్త వ్యవసనాలకు బానిసయ్యాడు కనుకనే ఆయన్ను వదలి ఇక్కడికి రావలసి వచ్చింది. నన్ను నా బిడ్డను జీవితాంతం బతికించడానికి కట్నం కావాలా? మీ కోర్కెల్లో కాలిపోయేందుకు, రేయింబవళ్లూ మీకు చాకిరీలు చేసేందుకు మాకెంత కట్నం ఇస్తారు? మీకు పిల్లల్ని కనడానికి,, మీ పిల్లల్ని పెంచడానికీ.

"ఒకరు వ్యసనాలకి బానిసలైతే మీరు డబ్బుకి బానిసలు. మీరంతా బానిసలు. మీరు బానిసలై ఉండీ మీకింద ఆడజాతి బానిసలుగా పడిఉండాలని కలలుగనే స్వార్థం కల బానిసలు..."

"పార్వతీ?" పార్వతి మాటలకు రాజీ అడ్డుకట్ట వేయాలనుకుంది. కానీ పార్వతి ఆగలేదు.

"అవును రాజీ? నీకు మేం భారంగా ఉన్నామని భావిస్తే మేం ఎటైనా దూరంగా వెళ్లిపోతాం. అంతేగానీ నీ కష్టాన్ని నాకోసం త్యాగం చెయ్యడం నాకిష్టంలేదు. ఇలాంటి పెళ్లి చేసుకోవడం కంటే పురుష ప్రపంచానికి సవాలుగా నిలిచిన నీ మనస్థైర్యాన్ని గౌరవిస్తూ నీ ఇంట్లో పనిమనిషిగా బ్రతకడం నాకెంతో సంతృప్తినిస్తోంది. ఆ తృప్తితోనే నా బతుకేదో బతుకుతాను. నా బిడ్డను బతికించుకుంటును. అల్పబుద్ధుల్తో బతికే ఇలాంటి మగవాళ్ల కాళ్లకింద గులాములా బతకమని మాత్రం శాసించకు రాజీ".

కన్నీళ్లతో వేడుకుంటూ సోఫాలో కుప్పకూలిపోయిన పార్వతిని మూగదానిలా చూస్తున్న రాజీ కనుకొలకుల్లోంచి అప్రయత్నంగా రెండు కన్నీటిబొట్లు రాలాయి. సుధీర్ అక్కడ ఇమడలేక తలొంచుకుని చకచకా వెళ్లిపోయాడు.

"ఆడది, అందమైన పూలతీగ లాంటిది. పచ్చనిచెట్టు అండగా ఉంటే పచ్చపచ్చగా ఎదుగుతుంది. ఏ చెట్టూ తోడు లేకుంటే నేలనే కావలించుకుని పడుకుంటుంది. అంతేగానీ ముళ్లచెట్టుకు అల్లుకుని ముళ్లతో కాపురం చేయడం కంటే పూలతీగను మరో దౌర్భాగ్యమే ముంటుందీ? రాజీ?" నువ్వే చెప్పు.